# మేరేజ్ స్టోరీ

- మల్లాది వెంకట కృష్ణమూర్తి

మోహన్‌ని రాధ ప్రేమించింది. రాధని మోహన్ కూడా ప్రేమించాడు. ట్వంటీ ఫస్ట్ సెంచరీలో కూడా ఇండియాలో కులాలు తల్లిదండ్రుల సమ్మతికి అడ్డుగోడలుగా నిలుస్తాయన్న నమ్మకానికి వ్యతిరేకంగా వారిరువురి తల్లిదండ్రులు అడ్డుపడలేదు.

"సరే, ఓకే!" అన్నారు.

వాళ్ల పెళ్లి అయ్యాక...

మొదటి ఏడు:

"రాధా! రాత్రి నిద్రలో ఒకటి రెండు సార్లు దగ్గావు. సాయంత్రం ఆఫీస్ నుంచి రాగానే నిన్ను హాస్పిటల్‌కి తీసుకెళ్తాను. ఊళ్లో మలేరియా వుందని పేపర్లో రాశారు. ఎందుకైనా మంచిది, రెండు రోజులకి సరిపడే బట్టలు, బ్రష్, టూత్‌పేస్ట్ ఏర్‌బాగ్‌లో సర్దివుంచు. డాక్టర్ ఎడ్మిట్ అవమనవచ్చు. నీకు షాన్‌బాగ్ హోటల్ భోజనం ఇష్టం కదా? కేరేజ్ ఏర్పాటు చేస్తాను."

రెండవ ఏడు:

"చూడు రాధా! నిన్నటి కన్నా ఇవాళ నీకు దగ్గు ఎక్కువగా ఉంది. డాక్టర్‌కి ఫోన్ చేశాను. హాస్పిటల్ నుంచి ఇంటికెళుతూ వచ్చి ఓసారి నిన్ను చూస్తానన్నారు. అబ్బాయ్ హోటల్ నుంచి స్పెషల్ మీల్స్ కేరేజ్ తెస్తాగానీ, వంట మానేసి ఇవాళ పడుకుని రెస్ట్ తీసుకో. ఆఫీసుకి సెలవు పెట్టాను."

మూడవ ఏడు:

రాధా! నీకు హైద్రాబాద్ నవంబర్ చలి పడదనుకుంటా. వారమైనా దగ్గు తగ్గలేదు. నేను హోటల్‌లో తిని, నీకు కూరలు, సాంబారు తెస్తాను. అన్నం మాత్రం వండుకో. ఇంకో రెండు రోజులు చూసి అప్పటికీ తగ్గకపోతే డాక్టర్ దగ్గరికి వెళ్దాం.

నాలుగో ఏడు:

రాధా! తగ్గిపోయిందనుకున్నాను కానీ ఈసారి డిసెంబర్ నెల చలికి నీకు దగ్గు మొదలైంది. వంటవగానే రెస్ట్ తీసుకో. ఈ చలిలో గిన్నెలవీ నువ్వు కడగక. పనిమనిషి ఎటూ వుందిగా. నువ్వసలు నీళ్ల జోలికి వెళ్లకు. బాబిగాడికి ఈ రోజు స్నానం చేయించకసలు. వేడిగా ఏమైనా తాగాలనుకున్నప్పుడల్లా సూప్ కాచుకో.

అయిదో ఏడు:

రాధా! ఏటా ఈ పీడ నీకు తప్పదులా వుంది. సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ కాఫ్ సిరప్ తెస్తాను. వేసుకో. సాయంత్రం నాలుగున్నరకి నాకు ఆఫీసుకి ఓసారి ఫోన్ చేసి కోరెక్స్ దగ్గుమందు కొనాలని గుర్తు చెయ్యి.

ఆరో ఏడు:

"అబ్బబ్బ రాధా! సైరన్‌లా ఆ దగ్గేంటి? కాస్తంత వేడి నీళ్లు గార్గిల్ చేయడమో, ఏదో చెయ్యొచ్చుగా. వినలేక ఛస్తున్నాను."

ఏడో ఏడు:

"రోగిష్టిదానా! నా సంపాదనంతా నీ దగ్గుకే పోతోంది."

ఎనిమిదో ఏడు:

"మొదలైందీ? నీకు ఉబ్బసం వుందన్న సంగతి దాచి మీ వాళ్లు నన్ను మోసం చేసి నిన్ను కట్టబెట్టారు. వాళ్లనే డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లమను. వాళ్లనే మందులు కొనివ్వమను."

టైటిల్ ప్రకారం ఇక్కడితో కథ అయింది.

కానీ ఈ కథని చిన్న టచ్‌తో పూర్తి చేయాలంటే...

తొమ్మిదో ఏడు:

"రాధా! నువ్వు, నీ దగ్గు నాకెంత ముఖ్యమో నీవు ఈ లోకానికి శాశ్వతంగా దూరం అయ్యాక కానీ అర్థం కాలేదోయ్. నీ రోగానికి విసుక్కున్నందుకు నన్ను క్షమించానని ఓసారి కల్లోనైనా కనపడి చెప్పవా?".